



మధ్యాహ్నం 12—30 అయింది. ఆంధ్రా యూనివర్సిటీలో గంట గణగణమని మ్రోగింది. స్టూడెంట్సందరు క్లాసు రూముల్లో నుంచి బయటకు వస్తున్నారు. రాజా, రాంబాబు కూడా క్లాసు రూములోనుంచి బయటకు వచ్చారు. ఇద్దరూ ఎం. కాం. చదువుతున్నారు. ఇద్దరూ బి. కాం. లో కూడా క్లాస్‌మేట్స్. అదృష్టము కొద్దీ యూనివర్సిటీ జీవితము కూడా కలిసే గడుపుతున్నారు. రాజా సొంతవూరు రాజమండ్రి. రాంబాబుది కొవ్వూరు. ఇద్దరూ రాజమండ్రిలో బి. కాం. చదివారు.

హాస్టల్లో రూముకి వచ్చారు. అన్నట్లు చెప్పటం మరిచాము. ఇద్దరూ ఇప్పుడు రూమ్‌మేట్స్.

"రాజా! త్వరగా పద మెస్సుకి! మాట్నీకి వెళ్దాం. అలంకార్‌లో మంచి సినిమా ఆడుతోంది!"

"బాబూ! రాత్రి తెల్లవార్లూ చదివి ఎల్లాగో ఈ పరీక్షలు పూర్తిచేశాము. మంచి నిద్ర వచ్చేటట్లున్నది. పైగా వసంత ఫస్ట్ షోకి వెళ్దామంది."

"అలా అయితే మధ్యాహ్నం చక్కగా నిద్రపోయి, సాయంత్రం నాలుగున్నరకే బయల్దేరదాం. చక్కగా కొంచెంసేపు టవున్లో తిరిగి, పిక్చరుకి వెళ్దాం" అన్నాడు రాంబాబు.

ఇద్దరూ మెస్సుకి చేరుకున్నారు. మీల్సుచేసి అవుట్ గేటు దగ్గిరకు వెళ్లారు. రాజా రెండు కిళ్ళీలు కట్టమన్నాడు అక్కడి కిళ్ళీకొట్టులో. అవి, కొన్ని వీక్లీ పత్రికలు తీసుకొని మళ్ళీ రూముకి బయల్దేరారు.

వచ్చి, చెరో మంచంమీద పడుకున్నారు.

!"ఏరా! చదువు అయిపోయింది కదా! ఏ భవిష్యత్తు గురించి ఏమాలోచించావు." అని రాంబాబు ప్రశ్నించాడు.

"ఆలోచించటానికి ఏముంది. ఏదో ఒక ఉద్యోగంలో ప్రవేశించటమే."

"నీకేమోయ్, మంచి ఉద్యోగమే వస్తుంది. మీ నాన్నగారు తల్చుకుంటే వది నిముషాలలో ఉద్యోగం సంపాయించగలవు."

రాజా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. నిజానికి రాజా తండ్రి ఆనందరావుగారు అంతటివారే. లక్షాధికారి. రాజమండ్రి దగ్గిర పల్లెటూళ్లో కొబ్బరి తోటలు, మామిడి తోటలు, 50 ఎకరాల మాగాణీ పొలము, ఇవిగాక రాజమండ్రిలోనే రెండు మేడలు ఉన్నాయి. పోగా, బోలెడంత 'పొలిటికల్ ఇన్‌ఫ్లూయన్స్' ఉంది.

రాంబాబు, రాజా నిద్రపోయారు. గణ గణ మని అలారం టైమ్‌పీస్ నాల్గు గంటలకు మ్రోగింది. ఉలిక్కిపడి లేచి రాజా టానిని నొక్కాడు. రాంబాబుని కూడా నిద్రలేపాడు.

మొహం కడుక్కొని త్రిమ్ముగా బయల్దేరారు. రూముకి తాళం తగిలించి. యూనివర్సిటీ ఇన్‌గేటు దగ్గిరకు వచ్చేటప్పటికి, అప్పుడే బస్సు వచ్చి ఆగింది. ఇద్దరూ ఎక్కారు.

బీచ్ ప్రక్కనించి అంటే రామకృష్ణా మిషన్ దగ్గిరకు వచ్చి, ఆగింది. అక్కడ ఇద్దరూ దిగారు.

అక్కడనుంచి టవునుకు నడిచివెళ్లారు.

రాజా వసంతను గాఢంగా ప్రేమించాడు. వసంత యూనివర్సిటీ ఆర్ట్సు కాలేజీలో ఎమ్. ఏ. ఫైనలు చదువు తున్నది. విజయవాడ సొంతవూరు. వారి ఇద్దరి పరిచయము కొద్ది తమాషాగా జరిగింది......

క్రిందటి సంవత్సరం యూనివర్సిటీలో ఇంటర్ కాలేజియేట్ డిబేట్స్ పోటీ జరిగినపుడు, రాజా ప్రథమ బహుమతిని సంపాదించాడు. రాజాకి చిన్నప్పటి నుంచి నీటియందు ప్రవేశమున్నది. అంతా అయిపోయిన తరువాత రాజా, రాంబాబు బైటికి వస్తూంటే "కంగ్రాట్యులేషన్స్" అనే ఒక కోమల కంఠ ధ్వని వినపడింది. ఎవరా అని వెనక్కు తిరిగి చూశాడు రాజా. ఆకుపచ్చచీర, అదే రంగు జాకెట్టు ధరించి, అందముగా నిరాడంబరముగా నున్న ఒక స్త్రీని చూసి, "థాంక్స్" అన్నాడు రాజా.

"మీరెంతో బాగా మాట్లాడారు. మీరు విజయం పొందుతారని ముందే అనుకున్నాను."

కొంచెం గర్వం కలిగింది. చిరునవ్వు నవ్వుతూ "మీరెలా ముందు వూహించార"ని ప్రశ్నించాడు.

"ఇదివరకు మీరు డిబేట్స్‌లో మాట్లాడుతూ ఉంటే వినేదానిని. అబ్బ! మీరు చాలా చక్కగా మాట్లాడుతారు. ఇచ్చిన ప్రతి విషయము చక్కగా, అన్ని కోణాలనుంచి పరిశీలించగలరు."

"ఏమమ్మోయ్ వసంతమ్మా! నువ్విక్కడ ఇలా మాట్లాడుతూ ఉంటే, బస్సు మనకి దొరకదు. హాస్టల్‌దాకా నడిచిపోవాల్సిందే. ఆయనా యూనివర్సిటీ స్టూడెంట్సే కదా. ఎక్కడికీపోరు. పద..... పద.....!" అని వసంత స్నేహితురాలు జలజ తొందర చేసింది. జలజ గడుసు స్వభావము కలది.

ఈ సంఘటన జరిగినప్పటినుంచి వారిరువురి స్నేహం ప్రారంభమయి క్రమక్రమముగా పెరిగి ప్రేమలోకి దిగింది. ఇద్దరికీ తెలుగు సాహిత్యమంటే

నికలేని ప్రీతి. రాజా చిత్రకారుడు. ఆమె, తనకు ఆ కళయందు ప్రవేశము లేకపోయినప్పటికి, మంచి చిత్రాలను చూసి ముగ్ధురాలు కాగలదు. వసంత చక్కటి కథలు వ్రాయగలదు. ఒక సంవత్సర సాహచర్యం వలన ఇరువురు ఒకరిని విడిచి మరొకరు ఉండలేనంత దగ్గిరగా అయిపోయారు......

టవున్లో కొద్దిసేపు తిరిగిన తర్వాత వసంతా, జలజలు కనపడ్డారు వారికి. పరీక్షలు ఏలా వ్రాశావని వసంత వారిని ప్రశ్నించింది.

"క్వైట్ వోకే! మరి మీరెలా వ్రాశారు. మీని

# జీవవాహిని

విన్నవే అయిపోయాయను కుంటామ." అని రాజా అన్నాడు.

"ఆ! మేము కూడా బాగా వ్రాశాము. రండి! టిఫిన్ ఎక్కడన్నా హోటల్లో చేసి సినిమాకువెళ్దాం" అన్నది వసంత.

అరగంట తరువాత సినిమాకు వెళ్లారు. రెండవ రోజే రాజా, రాంబాబు, వసంత ఒకే రైల్లో వెళ్లిపోయారు. రాజమండ్రి దగ్గిర రాజా దిగుతూ, తమ వివాహం గురించి తన తండ్రితో సంప్రదించి ఉత్తరం వ్రాస్తానని వసంతతో చెప్పాడు.

*　　*　　*

రాజమండ్రిలో రాజా తండ్రితో తన విషయము చెప్పాడు. తన భార్య రాజా పుట్టిన రెండవ ఏడాదికే మరణించినది. కాబట్టి ఆనందరావుగారు కుమారుని అతి గారాబముగా పెంచారు. అతని మాటను కాదు అనరు. వెంటనే ఒప్పుకున్నారు. రెండు నెలల తరువాత ఒక మంచి శుభముహూర్తాన వివాహము అతి వైభవముగా జరిగింది. వసంత తల్లితండ్రులు తమకు ఇంత మంచి సంబంధము దొరికినందుకు చాలా ఆనందించారు. ఇక వసంత, రాజాల ఆనందమునకు అంతులేదు.

వివాహమయిన వారం రోజుల తర్వాత పరీక్షా ఫలితములు తెలిశాయి. ఇద్దరూ ప్యాసయ్యారు. రాంబాబు ప్యాసయ్యాడు కాని జలజ పరీక్షపోయింది. తరువాత కొన్ని రోజులకు మద్రాసులో ఒక బ్యాంకిలో రాజాకి నెలకు ఆరువందల రూపాయల ఉద్యోగం దొరికింది. రాజా, వసంత మద్రాసు వెళ్లిపోయారు. ఆనందరావుగారు మాత్రం రాజమండ్రిలోనే స్వంతమేడలో ఉండి, పొలం, తోట చూసుకుంటున్నారు.

*　　*　　*

మద్రాసులో రాజా త్యాగరాయనగర్లో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఒక కారు కూడా కొన్నాడు. రోజూ కారులోనే బ్యాంకికి వెళ్ళి వచ్చేవాడు. ఇద్దరూ హాయిగా కాలం గడుపుతున్నారు. రెండు సంవత్సరాలు గిర్రున తిరిగిపోయాయి. ఒక రోజు సాయంత్రం........

"వసంతా త్వరగా రెడీకా! సినిమాకు వెళ్దాం." అప్పుడే బ్యాంకి నించి ఇంటికి వచిన రాజా అని, మొహం కడుక్కోటానికి బాత్రూమ్కి వెళ్లాడు.

వసంత కాఫీ తీసుకుని వచ్చి హాల్లో టేబిల్ మీద పెట్టింది. రాజా టవల్తో మొహం తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు.

"మీరు కాఫీ త్రాగుతూఉండండి. నేను ఈ లోపల తయారవుతాను" అని చెప్పి వసంత వెళ్ళిపోయింది.

అరగంట తరువాత సినిమాకు బయల్దేరివెళ్ళారు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన తరువాత వసంత భోంచేయలేదు. తల నొప్పి వచ్చింది. తెల్లవారేటప్పటికి జ్వరం తీవ్రంగా వచ్చింది. వెంటనే రాజా ప్రక్కవీధిలో ఉన్న డాక్టర్ రామారావు గారికి ఫోన్ చేసి పిలిపించాడు. ఆయన వచ్చి, ఇంజక్షన్ ఇచ్చి, మందు తర్వాత పంపిస్తానని చెప్పి వెళ్ళిపోయారు. రాజా నాలుగు రోజులు బ్యాంకికి సెలవుపెట్టాడు. వసంత జ్వరం తగ్గటంలేదు. డాక్టరుగారు అది విషజ్వరమని తేల్చారు. పదిహేను రోజుల తర్వాత దురదృష్టవశాత్తు వసంత మరణించింది.

వసంత మరణము రాజా హృదయము మీద సమ్మెట పోటులా తగిలింది. ఏమి చేయటానికి తోచలేదు. అనుకోని సంఘటన. జ్వరంవస్తే రెండు మూడు రోజులకో, లేక తరువాత తగ్గుతుందని అనుకున్నాడు కాని ఇలా జరుగుతుందని అనుకోలేదు. తండ్రి వసంత మరణించిన రెండవ


ఐవెటెక్స్
అలంకరణ సామగ్రి
* ఐవెటెక్స్ కాటుక
* ఐవెటెక్స్ బిందీ
* ఐవెటెక్స్ కుంకుంపేస్టు


తయారు చేయువారు
అరవింద్ లేబరేటరీస్
పోస్టు బాక్సు నెం. 1415, మద్రాసు-17.

ఓం! తత్! సత్!

సుఖ జీవిత సేవ
"సిద్ధవైద్యమహిమ"
సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము
కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి గారి
'మేల్ మాయిల్ మందు'
(Regd)
దీర్ఘకాల చర్మరోగములకు చక్కని నివారిణి
నల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దులు, పొట్టు, గజ్జి (చర్మ సంబంధము) పొడలు గల చోట్లలో తిమురు, సూదితో పొడిచినప్పుడు నొప్పి లేకుండుట, నిప్పుపడి బొబ్బలు గలిగినా తెలియకుండుట, దుర్నీరు సర్వ అవయవములందు వ్యాపించి, రక్తములో కలిసి మత్తు కలుగజేయుట, (నరముల సంబంధము) చేతివ్రేళ్లు ముడుచుకొనుట, బొబ్బలు లేచుట, ముక్కు బంధనములు, పాదమునందు వల్లను పుండ్లు ఏర్పడుట, కాలుచేతులు వ్రేళ్ళు తగ్గుట, ముక్కు పొట్టవడుట, చూచుటకు వినుగు పుట్టించు రణములు (అస్థి సంబంధము) వీటికి చక్కని నివారిణి.
1 మండలం (40 రోజులు) నూనె, లేహ్యము రు. 10/- తపాలు ఖర్చు రు. 2/-
8 ఔన్సుల శ్రీ పరమాత్మ తైలం రు. 4-50 తపాల ఖర్చు రు. 1-50
సిద్ధడాక్టర్
కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు
4/2బి, మేల్ మాయిల్ P.O., (N.A. Dt.)

రోజు అక్కడకు చేరుకున్నారు. రాజుని ఓదార్చుట ఆయనకు అలవి కాలేదు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. అంత్యక్రియలు తండ్రి దగ్గరుండి జరిపించాడు. రాజుని తనతోపాటు రాజమండ్రికి తీసుకొని వెళ్ళిపోయారు.

* * *

రాజమండ్రిలో తాము ఉంటున్న మేడలో పై భాగాన్ని రాజారావు గారనే ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్‌కి అద్దెకిచ్చారు. ఆయన భార్యపేరు విమలమ్మ. ఒక కూతురు, కొడుకూ ఉన్నారు. పేర్లు సావిత్రి, రఘు. సావిత్రి బి. ఏ. ప్యాసయింది. సుమారు 21 సంవత్సరాలు ఉంటాయి. తెల్లగా, సన్నగా, నాజూకుగా ఉంటుంది. అందకత్తెనే చెప్పవచ్చు. సోషల్‌గా తిరిగే స్వభావము. రాజారావుగారు కూతురికి మంచి సంబంధము కోసం ఆ అమ్మాయి బి. ఏ. ప్యాసయినప్పటినుంచి వెదుకుతున్నారు కాని కుదరలేదు. క్రిందటేడే సావిత్రి బి. ఏ. ప్యాసయింది. రఘు ఫిఫ్త్‌ఫారం చదువుతున్నాడు. విమలమ్మ హృదయము నవనీతము. దైవభక్తురాలు. ఆనందరావుగారిని అన్నగారని పిలుస్తుంది. వారి మంచితనం గ్రహించి, తనకెవ్వరూ తోడు లేకపోవటం వల్ల ప్రతిరోజూ కొంత భాగము గడిపేవారు రాజు, వసంత మద్రాసులో ఉన్నప్పుడు.

రాజు దాదాపు పిచ్చివానిలాగా అయిపోయాడు. ఆనందరావుగారు అతనిస్థితికి చాలా బాధ పడుతున్నారు. ఇదివరకటి కథంతా రాజారావుగారింట్లో చెప్పారు. వారు కూడా రాజుస్థితికి జాలిపడ్డారు. అతనిని మళ్ళీ స్వస్థునిగా చేయాలని వారందరు నిశ్చయించుకున్నారు.

సావిత్రి అతని దగ్గరకు కాఫీ, టిఫిన్ ప్రతిరోజూ తెచ్చియిచ్చేది. ఎవరిస్తున్నారో కూడా తెలియకుండా యాంత్రికంగా తీసుకునేవాడు. సావిత్రి చాలాసార్లు అతనిని మాటలలోకి లాగాలని ప్రయత్నించింది కాని ఏవో రెండు, మూడు మాటలు తప్ప ఎక్కువ మాట్లాడటం లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుండేవాడు. ఎప్పుడూ వసంత, ఆమె చేష్టలే మనసులో మెదిలి అమిత దుఃఖ పడేవాడు. అప్పుడప్పుడూ నిద్రలో కలవరించేవాడు కూడా.

రాజు వచ్చి నెల పదిహేను రోజులయ్యాయి. ఒక రోజు కాఫీ ఇస్తూంటే, సావిత్రితో రాజు తనంతటతనే పలుకరించాడు. సావిత్రి ఆరోజు గులాబీరంగుచీర ధరించి చాలా ఆకర్షణీయంగా, అత్యంత అందంగా ఉంది. రాజుకి ఎందుకో వసంత ఎదురుగా నుంచున్నట్లు తోచింది. కొద్దిసేపు ఆమె చదువు గురించి, ఇతరేతర విషయాల గురించి మాట్లాడాడు. కొద్ది ఉత్సాహంగానే కనపడ్డాడు. అతనిలో ఈ కొద్ది మార్పుకే సావిత్రి సంతోషించింది. ఒకరకంగా ఆమె అతనిని ఆరాధిస్తోందేమో కూడా!

తరువాత నించి రాజు మెల్లిగా కోలుకోసాగాడు. రోజులో చాలా గంటలు అతని దగ్గరే ఉంటున్నది సావిత్రి. రాజువేసిన చిత్రాలని అనేకం చూసి మెచ్చుకుంది. ఆమె సాహచర్యంలో వసంతను మర్చిపోవటానికి రాజు ప్రయత్నిస్తున్నాడు.

రాజుకి ఒకరోజు ఉన్నట్లుండి జ్వరం తీవ్రంగా వచ్చింది. డాక్టర్ రోజూ మందిస్తూ, చాలా జాగ్రత్తగా చూడాలని చెప్పారు. ఆనందరావుగారికి మతిపోయినంత పనయింది. రాజారావుగారు, విమలమ్మ అనేక విధాల ఆయనకు ధైర్యం చెప్పారు. "రాజుని మా కుటుంబములోని వ్యక్తిగా మేము భావిస్తున్నాము. అతనిని తిరిగి మామూలు మనిషిగా చేయటానికి మేము శక్తివంచన లేకుండా కృషి చేస్తాము" అని ఆయనను వూరడించారు.

సావిత్రి ఎప్పుడూ అతని దగ్గిరే ఉంటోంది. విమలమ్మ అతనికి కావలసిన రొట్టె, పాలు అన్నీ సావిత్రిచేత తనే చేసి పంపిస్తున్నది. వేళ తప్పకుండా సావిత్రి అతనికి మందు ఇస్తున్నది. సావిత్రి చేస్తున్న పరిచర్యచూసి డాక్టరుగారు ఈవిధంగా ముందు కూడా కొనసాగితే త్వరలో కోలుకుంటాడని ధైర్యంచెప్పారు. జ్వర తీవ్రతలో రాజు రోజులో చాలా భాగము స్పృహలో ఉండటంలేదు. సావిత్రి పాపం చాలా కష్టపడుతున్నది. ఆనందరావుగారు ఆమె నిస్వార్థసేవను చూసి ఆశ్చర్యపోయారు.

పదిహేను రోజుల తరువాత రాజు జ్వరము తగ్గుముఖము పట్టినది. తండ్రి చాలా సంతోషించి, సావిత్రితో, "అమ్మా! నీ దయవల్లనే వాడు నాకు దక్కాడు. నీ సేవకు మేము ఆజన్మాంతము కృతజ్ఞులమై ఉంటాము." అన్నారు. రాజు కూడా కృతజ్ఞతా పూర్వకంగా ఆమెవంక చూశాడు. ఓరగా సావిత్రి అతనివంక చూసింది.

రోజు రోజుకి రాజులో మంచి మార్పు కనిపిస్తున్నది. వసంతను మర్చిపోలేనప్పటికీ, ఇదివరకటంత బాధపడటం లేదు. సావిత్రితో చాలా ఉత్సాహంగా ఉంటున్నాడు.

సావిత్రిని తన కోడలిగా చేసుకుంటే తప్ప, తాము ఋణ విముక్తులము కాలేమని ఆనందరావుగారు అనుకున్నారు. ఈ విషయమే రాజారావుగారితో సంప్రదిస్తే, ఆయన సావిత్రిని పిలిచి ఆమె అభిప్రాయము అడిగారు. సావిత్రి సిగ్గుపడి, మౌనంగా లోపలికివెళ్ళిపోయింది. విమలమ్మ నవ్వుతూ సావిత్రికి ఇష్టమేనని వారితో చెప్పింది. ఆనందరావుగారు ఆనందపడిపోయారు. ఇకపోతే రాజు అభిప్రాయమే మిగిలింది. "నేను వసంతను మరువలేకుండా ఉన్నాను. సావిత్రికి అన్యాయం చేయలేను"ని అన్నాడు రాజు. కాని తండ్రి ఎలాగైనా అతనిని ఒప్పించదలుచుకున్నాడు. సావిత్రి అతనిని మార్చగలదనే ధైర్యం ఆయనకు వుంది.

ఆనందరావుగారు ఒక స్థిరనిశ్చయానికి వచ్చారు. చిన్నప్పటినుంచి రాజుకి దైవభక్తి ఉంది. రాజుతో తిరుపతికి అందరం కలిసి వెళ్దామని చెప్తే, అతను దానికి వెంటనే ఒప్పుకున్నాడు. మరుసటిరోజే తిరుపతికి వెళ్ళారు ఒక పెద్ద కారులో. ప్రయాణము చాలా చక్కగా జరిగింది. కొండమీద ఒక కాటేజీని అద్దెకు తీసుకున్నారు.

ఆనందరావుగారు వెంకటేశ్వరస్వామికి కళ్యాణము చేయించారు. అది అయిన తరువాత స్వామి దర్శనానికి వెళ్ళినపుడు, హఠాత్తుగా ఒక డబ్బా సంచిలోనుంచి బైటకు తీశారు. రాజుతో, "రాజా! స్వామికి నమస్కరించి దీంట్లోనుంచి ఏదో ఒక చీటి తియ్యమని" అన్నారు. ఆ డబ్బాలో మడత పెట్టిన చీటీలు చాలా ఉన్నాయి. రాజు కిదేమీ అర్థంకాక పోయినప్పటికి తండ్రి చెప్పినట్లు చేశాడు. సావిత్రి వాళ్ళు కూడా అర్థంకాక, ఆశ్చర్యపోయారు. ఆ చీటీ తీసి చూస్తే "అవును" అని ఉంది. ఆనందరావుగారు కూడా దేవుడికి నమస్కరించి బైటికి వచ్చారు. అప్పుడు రాజుతో ఇలా చెప్పారు.

"రాజా! నీ భవిష్యత్తు గూర్చి నేను చాలా భయపడ్డాను. అంతా దేవుని మీద భారంవేశాను. నాకీ ఉపాయము తట్టింది. ఇందులో కొన్ని చీటీలు ఉంచాను. సగం చీటీలలో "అవును" అని, మిగిలిన వాటిలో "కాదు" అని వ్రాశాను. "అవును" అని వస్తే నువ్వు సావిత్రిని వివాహమాడుట భగవన్నిర్ణయమని అనుకున్నాను. రెండవది వస్తే ప్రయత్నించటము అనవసరమని అనుకున్నాను. ఇది ఇలా వచ్చినందుకు నువ్వు సావిత్రిని వివాహమాడాలి."

రాజు దీనికి వ్యతిరేకించలేదు.

వారిరువురి వివాహము తిరుమలలో అతి నిరాడంబరముగా జరిగిపోయింది.

కాని, ఆ డబ్బాలో ఉన్న చీటీలన్నిటిలో "అవును" అనే వ్రాసి ఉన్నదని ఆనందరావుగారికి తప్ప మరెవ్వరికీ తెలియదు. ఆయన స్వామి విగ్రహము ఎదుట తన తప్పు క్షమించమని మనసులో ప్రార్థించారు. ●

